ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శనివారం 27 జూలై 2024





సమస్యల బడి
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కష్టాలు 8

8 కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి





పట్టుకున్న గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గంజాయి టెస్ట్ కిట్

# 'మత్తు' పై సమరం

- గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్
- డ్రంకెన్ డ్రైవ్ తరహాలో తనిఖీలు
- జిల్లా పోలీస్ స్టేషన్లలో గంజాయి కిట్లు
- కిట్ల సాయంతో ఇప్పటికే టెస్టులు
- ఏడు నెలల్లో 50 కేసులు, 130 మంది అరెస్టు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా పోలీస్ యంత్రాంగం మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. యువత గంజాయికి అలవాటు పడుతుండడం, ఇటీవల నిల్వలు పట్టుబడుతుండడం వంటి పరిణామాలకు తోడు గంజాయిని సిగరెట్లు, చాక్లెట్లు, ఇతర రూపాల్లో విక్రయిస్తున్న నేపథ్యంలో సీరియస్‌గా తీసుకుంది. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ నేతృత్వంలో మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. పోలీసుల నియం త్రణ ఒకవైపు సాగుతుండగా మరోవైపు నిఘా కన్నుగప్పి గంజాయి పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు చేరుకుంటున్న తీరును అరికట్టడానికి విస్తృత తనిఖీలు చేస్తున్నారు. గంజాయి తాగుతున్న యువత తల్లిదం డ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. తాజాగా డ్రంకెన్‌డ్రైవ్ తరహాలో జిల్లాలో గంజాయి పరీక్షలు నిర్వహించడానికి అన్ని పోలీస్ స్టేషన్లకు కిట్‌లు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం ఎస్పీ అఖిల్ మహాజన్ కిట్లను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు.



గంజాయి కిట్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## జిల్లాలో నమోదవుతున్న కేసులు

గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నా మరోవైపు గంజాయి కేసులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. 2021లో 22 కేసుల్లో 71 మందిని అరెస్టు చేశారు. 56.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2022లో 16 కేసుల్లో 56 మందిని అరెస్టు చేసి 35.09 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 2023లో 71.79 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని 61 కేసుల్లో 141 మందిని అరెస్టు చేశారు. గడిచిన ఏడు నెలల్లోనే 49 కేసుల్లో 130 మందిని అరెస్ట్ చేశారు. దాదాపు 34 కిలోల వరకు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## పొరుగు రాష్ట్రాల సరిహద్దుల నుంచి..

జిల్లాలోని అటవీ గ్రామాల్లో గతంలో పత్తి, కంది, పంటల్లో అంతర పంటగా గంజాయి సాగు చేసేవారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల దాడులు నిరంతరం కొనసాగించడంతో సాగు నిలిచిపోయింది. ప్రస్తుతం పొరుగున ఉన్న రాష్ట్రాల సరిహద్దు జిల్లాల నుంచి గంజాయి రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు రైల్వే, మార్గం ఉన్న వరంగల్, కామారెడ్డి నుంచి జిల్లాకు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి కూడా గంజాయి వస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గంజాయి నియంత్రణ కోసం పోలీసులు ప్రచారం చేయడంతోపాటు గంజాయికి సంబంధించిన సమాచారాన్ని డయల్ 100కు గానీ, టాస్క్‌ఫోర్స్ 8712656392 నంబరుకు గానీ సమాచారం ఇవాలని సూచిస్తున్నారు.




జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

## జాగిలాలతో తనిఖీలు

జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి పోలీ సులు అవగాహన కార్యక్రమాలతోపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా యాంటీ డ్రగ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తూ విద్యా ర్థులను భాగస్వాములను చేశారు. ఒకవైపు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినా సిగరెట్లు, చాక్లెట్లు, ఇతర తినుబండారాలో గంజాయిని ఉంచి అమ్మకాలు సాగిస్తున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే పోలీస్ జాగిలాలతో తనిఖీలు చేపట్టే విధంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నార్కొటిక్ జాగిలాలను జిల్లాలో ఉపయోగిస్తున్నారు. అవి గంజాయి వాసనను పసిగడుతున్నాయి. గంజాయికి అలవాటు పడ్డ యువతను డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించి చికిత్స అందిస్తున్నారు. ఇటీవల జిల్లాలో పట్టుబడిన 31 కిలోల గంజాయిను పోలీసులు ధ్వంసం చేశారు. గంజాయి కిట్లతో యువతను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు ఎక్కడ కొనుగోలు చేశారు? ఏ విధంగా వస్తుంది? అనే దానిపై కూడా దృష్టి సారించారు.

## గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్



గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా పోలీస్ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణతో కలిసి గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు కిట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్ తరహాలో తరచూ తనిఖీలు చేస్తున్నామని, గంజాయి కిట్ల సాయంతో జిల్లాలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. 390 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయికి అలవాటు పడినవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గంజాయిని పట్టుకుంటున్నా తాగేవారిని గుర్తించడం కష్టంగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీస్ గంజాయి తాగేవారిని గుర్తించడానికి అన్ని పోలీస్ స్టేషన్లలో గంజాయి టెస్ట్‌ల కిట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తరహాలోనే గంజాయి టెస్ట్‌లు నిర్వహిస్తామని, గంజాయికి బానిసైనా వారిని పట్టుకుంటామని తెలిపారు. ఇప్పటికే సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లలో గంజాయి కిట్లతో పరీక్షలు నిర్వహించామని, పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి సరఫరా చేసిన వారిని పట్టుకున్నామని అన్నారు. సిరిసిల్లను గంజాయి రహిత జిల్లాగా మార్చే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లక్ష్మీనారాయణ

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నాగార్జున చక్రవర్తి



కలెక్టర్‌ను కలిసిన డాక్టర్లు లక్ష్మీనారాయణ, నాగార్జున చక్రవర్తి

సిరిసిల్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.నాగార్జున చక్రవర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

## ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



కాయకల్ప బృందంతో ఏరియా ఆస్పత్రి సిబ్బంది

వేములవాడ టౌన్, జూలై 26: వేములవాడ ఏరియా ఆస్పత్రిని కాయకల్ప బృందం డాక్టర్లు హరిప్రియ, సాయికిరణ్, సురేష్ శుక్రవారం సందర్శించారు. కాయకల్ప ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్‌లో భాగంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరు. వ్యర్థాల సేకరణ, విద్యుత్ వినియగం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం వంటివి పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సంతోష్‌చారి, డాక్టర్లు తిరుపతి, సుభాషిని, రత్నమాల ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు.

## జిల్లా వైద్యాధికారిని కలిసిన ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ సభ్యులు



జిల్లా వైద్యాధికారికి మొక్క అందజేస్తున్న సభ్యులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 26 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధుల్లో చేరిన డాక్టర్ వసంతరావును శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ సభ్యులు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి అజీజ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ



మొక్క నాటుతున్న డీఐఈవో మోహన్, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని డీఐఈవో చింత మోహన్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఐఈవో మోహన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని అధ్యాపకులకు సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక, గౌతమి పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. పేదల వైద్యం కోసం ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ అందజేస్తోందని పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్, స్వామి, నర్సయ్య, శంకర్, శరత్‌బాబు, దేవయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, చంద్రారెడ్డి, శివరాంరెడ్డి, దేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

సిరిసిల్ల రూరల్, జూలై 26 : డబ్బులను పొదుపు చేయడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని, భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందని పోస్టల్ శాఖ సిరిసిల్ల సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ గజ్జల వేణు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సిరిసిల్ల బ్రాంచ్ మేనేజర్ రాజేందర్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ విద్యార్థులకు పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కోసం పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, పోస్టల్ శాఖ మెయిల్ ఓవర్సీర్‌లు సాయిరాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కోనరావుపేట, జూలై 26 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. కోనరావుపేట మండలంలోని కొలనూరు, ధర్మారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ఇష్టమైన పద్ధతిలో బోధించాలన్నారు. మధ్యాహ్నం భోజనం మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనం అందించాలన్నారు. హెచ్‌ఎం మురళి నాయక్ ఉన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య పనులు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, తిమ్మాపూర్, గుండారం, నారాయణపూర్, వెంకటాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని కాలనీల్లో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. నిల్వ ఉన్న నీటిని పారబోశారు. వ్యాధులపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.

# వీటీడీఏ పనుల్లో వేగం పెంచాలి

సిరిసిల్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవస్థానం అభివృద్ధి అథారిటీ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీటీడీఏ పనులపై సమీక్షించారు. బద్దిపోచమ్మ ఆలయం, పార్కు నిర్మాణ పనులు, ఇతర పనులపై సమీక్షించి సూచనలు చేశారు. గుడిచెరువులో బండ్ అండ్ పార్కు పనులు రూ.12 కోట్లతో చేపట్టామని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ అధికారులు వివరించారు. పార్కులో నటరాజ, సూర్య నమస్కార విగ్రహాలు, హంపీ థియేటర్, ఇంటర్నల్ పాత్ వే, జోన్ 1 ప్లాంటేషన్ పూర్తి చేశామని, గ్రానైట్ ఫ్లోరింగ్, ల్యాండ్ స్కేట్ పనులు పూర్తయినట్లు తెలిపారు. వీటీడీఏ పనుల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎకరం స్థలంలో రూ.2 కోట్లతో చేపట్టిన మున్సిపల్ పార్కు నిర్మాణ పనులు, తిప్పాపూర్, మారుపాకలో మోడల్ లే అవుట్ పనులు తుది దశలో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈవో వినోద్‌రెడ్డి, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, దేవస్థానం ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, వీటీడీఏ కార్యదర్శి అన్సారీ, ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

# నాణ్యమైన విద్యను అందించాలి



మొక్క నాటుతున్న డీఈవో రమేష్ కుమార్

వీర్నపల్లి, జూలై 26 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి పాఠశాలల్లో వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్న ఉపాధ్యాయుల కొరతను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన కార్య క్రమాలను పరిశీలించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. జీఈసీవో పద్మజ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కేజీబీవీ ఎస్‌ఓ నీలిమా పాల్గొన్నారు.



టీఎన్జీవో భవన్‌లో పూజలు చేస్తున్న ఉద్యోగులు

# వైభవం..బోనం

**ఇల్లంతకుంట:** మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో బోనాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం మహంకాళమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్నూరు కాపు, యాదవ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కూర సురేష్, యాదవ సంఘం అధ్యక్షుడు మాడుగుల రాజయ్య నాయకులు పాల్గొన్నారు.



గంభీరావుపేటలో మహంకాళమ్మకు బోనాలు

వేములవాడ కల్చరల్, జూలై 26: పిల్లాపాపలను, పాడిపంటలను చల్లంగా చూడు పోచమ్మతల్లి అంటూ బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీఎన్‌జీవో కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోకి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, అధ్యక్షుడు హరికిషన్ ఉద్యోగులు నరసింహమూర్తి, జయకుమారి, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, వరి నర్సయ్య, నాగుల మహేష్, రాజేష్, కూరగాయాల శ్రీనివాస్, రాజేశ్వర్, చంద్రగిరి శరత్, ఎడ్ల శివసాయి, గోపన్నగారి చంద్రశేఖర్, నక్క తిరుపతి, సంకెపల్లి పవన్‌కుమార్, సాయి తదితరులు ఉన్నారు.

వేములవాడ పట్టణంలోని బచ్‌పన్ స్కూల్ ఆధ్వర్యంలో బద్దిపోచమ్మకు బోనాలను తీశారు. కరస్పాండెంట్ అనిల్‌కుమార్ ఉన్నారు.



వేములవాడలో బోనాలతో వెళ్తున్న ఆలయ ఉద్యోగులు



ఇల్లంతకుంటలో బోనాలతో విద్యార్థులు

# గోదావరిఖనిలో నకిలీ వైద్యులపై కొరడా

- ఆసుపత్రులను సీజ్ చేసిన తెలంగాణ వైద్య మండలి
- పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకుంటే చర్యలు: వైద్యాధికారి రాజ్‌కుమార్

కళ్యాణ్‌నగర్, జూలై 26: గోదావరిఖని పట్టణంలో అనుమతి లేకుండా ఆసుపత్రులను నడుపుతున్న నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి కొరడా ఝుళిపించింది. శుక్ర వారం తెలంగాణ వైద్య మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస క్లీనిక్, శివ పైల్స్ క్లీనిక్ పేరిట చికిత్స చేస్తున్న ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరిఖనిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది క్లీనిక్‌లు ఏర్పాటు చేసి అల్లోపతి, ఆయుర్వేదం, పైల్స్ ఆసుపత్రులు నెలకొల్పారని, అందులోనే ల్యాబ్‌లను, మెడికల్ షాపులను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్, స్టెరైడ్స్ ఇస్తున్నట్టు గుర్తించామని, వారిపై ఎన్‌ఎంసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు చెప్పారు. అర్హత లేని వ్యక్తులు ప్రైవేట్‌గా క్లీనిక్‌లు పెట్టి ప్రాక్టిస్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, పేరుకు ముందు డాక్టర్‌గా పెట్టుకోవద్దని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రాక్టిస్ నిర్వహిస్తే వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెచ్‌ఆర్‌డీఏ సెక్రెటరీ గౌతం, బృందం పాల్గొన్నది.

### క్లీనిక్‌లు మూసి వేసిన ఆర్‌పీఎంలు, పీఎంపీలు

గోదావరిఖనిలో శుక్రవారం పలు ఆసుపత్రులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న కొంతమంది ఆర్‌పీఎంలు, పీఎంపీలు క్లీనిక్‌లను, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లను, మెడికల్ షాపులను మూసివేసి పరుగులు తీశారు. ఈ బృందం ఎక్కడెక్కడ తనిఖీ చేస్తుందో సమాచారం తెలుసుకుని వారిని అనుసరించారు. అధికారుల బృందం కొన్ని ఆసుపత్రులకు వెళ్లే సరికి మూసివేసి ఉన్నాయి.


ఆర్‌ఎంపీ క్లీనిక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

# కేంద్ర బడ్జెట్‌తో నిరాశ.. రాష్ట్ర బడ్జెట్‌తో ఊరట



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిల్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఊరట లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్ర వారం సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడం కోసం వివిధ శాఖలకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకుడు బడ్జెట్ సమావేశాల్లో పూర్తి స్థాయిలో పాల్గొనకుండా బడ్జెట్ అంశాలను విని సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అనే అభిప్రాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై తన అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అధికారం కోల్పోయామని తిరిగి అధికారం కోసమే విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, నియంతలాగా వ్యవహరించడంతోనే ప్రజలు ఓడించారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి అనేక సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించారని, వాటిని అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ప్రభుత్వానికి ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక మంది రైతుల భూములకు సంబంధించిన సమస్య లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమాతతో రైతుల సమస్యల పరిష్కారి స్తామని చెప్పిన ప్రభుత్వం భూ సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న అసలైన పట్టాదారులకు పట్టాదారు పాసు బుక్కులు అందించాలన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, వెన్న సురేష్, సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్


మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

సుభాష్‌నగర్, జూలై 26: బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం మాట్లాడుతూ చత్రపతి సాహూమహరాజ్ నిమ్న కులాలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేశారని తెలిపారు. 1902 జూలై 26న వెనకబడిన కులాలు, అంటరాని కులాలకు, మహిళలకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని అన్నారు. సాహూ మహరాజ్ బ్రిటీష్ ఇండియాలోని కొలహాపూర్ సంస్థానానికి రాజు అని తెలిపారు. వెనకబడిన, నిమ్నవర్గాల పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారని, విద్య దూరం అయిన కులాలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించాడని, మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన పాఠశాలలకు ఆయన నిధులు కేటాయించి నిమ్న కులాలకు విద్యావ్యాప్తి కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దడ్డే శ్రీనివాస్, దొడ్డె సమ్మయ్య మాతంగి అశోక్, మంద బాలయ్య, కల్లెపెల్లి రాజేందర్, మాంకాలి తిరుపతి, పల్లె ప్రశాంత్‌గౌడ్, మారపెల్లి మొగిలయ్య పాల్గొన్నారు. బీఎస్పీలో ఎలగందల్‌కు చెందిన బోనాల సంతోష్, కిన్నెర రజనీకాంత్ చేరారు. జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

# గంజాయి కేసులో పలువురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ రాపల్లి వాగు వంతెన వద్ద గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని విచారించారు. కరీంనగర్‌లోని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది.

**ఇల్లంతకుంట:** మండలకేంద్రానికి చెందిన మహమ్మద్ జమీర్ గంజాయి కేసులో అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆటో నడుపుకునే జమీర్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి కిట్ ద్వారా పరీక్షించగా పాజిటీవ్‌గా తెలింది. జమీర్ వద్ద నుంచి 100 గ్రా. గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

**సిరిసిల్ల క్రైం:** రెండు గంజాయి కేసుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వీరబోయిన అజయ్, సిరిసిల్ల మండలం చిన్న బోనాలకు చెందిన అవునూరి ప్రశాంత్, పండుగ మహేశ్, సందవేణి మహేశ్ ఉన్నట్లు పేర్కొన్నారు. 150 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

## కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



వృద్ధుడి చేతులపై కుక్కగాట్లు

గంభీరావుపేట, జూలై 26: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో వృద్ధుడిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. లింగన్నపేటకు చెందిన లక్ష్మణ్ పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. రోడ్డుపై వెళ్తున్న లక్ష్మణ్‌ను వెంటపడి మరీ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు గౌరీ శంకర్ అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్‌కు తన వంతు సాయంగా హమీద్ వెయ్యి రూపాయలు అందజేశారు.

## 16.109 టీఎంసీలకు చేరుకున్న శ్రీపాద ఎల్లంపల్లి



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

- మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు నీటిని తరలించేందుకు రంగం సిద్ధం
- నీటిపారుదల శాఖ అధికారుల సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల సుమారు 23 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆదివారం కల్లా ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయి. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోకముందే ప్రాజెక్టులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టడం పరిపాటి. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల మిడ్ మానేరు, లోయర్ మానే డ్యామ్‌లకు వరద నీరు పెద్దగా రాకపోవడంతో ఆ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తకుండా ఒకటి, రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నంది మేడారం నంది పంప్‌హౌస్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి మిడ్ మానేరు నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గోదావరి పరివాహక ప్రాంత నీటిపారుదలశాఖ అధికారులతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తక్షణమే ఎల్లంపల్లి ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే కొంత మేలు జరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు 23,701 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో ప్రాజెక్టు 16.109 టీఎంసీల నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వస్తున్న వరద నీరు ఇలాగే కొనసాగితే శనివారం సాయంత్రం కల్లా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోనున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోక ముందే నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఎగువప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గల శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ మిడ్ మానేరు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. కరీంనగర్ శివార్లో గల లోయర్ మానేర్ డ్యాం పూర్తి నీటిమట్టం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రెండు రిజర్వాయర్ల ఎగువ ప్రాంతంలో వర్షాలు అంతగా కురవకపోవడంతో వరద నీరు తక్కువగా వస్తున్నది.

ఈ నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. మిడ్ మానేరుకు తరలించిన నీటిని, అవసరమైతే ఎల్ఎల్ఎండీకి, లేదంటే మల్లన్న సాగర్‌కు కూడా తరలించుకునే అవకాశాలు ఉన్నాయి. వర్షాల వల్ల వచ్చిన నీటిని వచ్చినట్లే మోటార్ల ద్వారా ఎత్తిపోస్తే వానా కాలం సీజన్, వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటికి డోకా లేకుండా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న అదనపు వరద నీటిని గేట్లు ద్వారా గోదావరిలోకి వదిలి పెట్టకుండా, నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్‌లను ఆన్ చేసి నీటిని మానేరులోకి ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## ఎస్సారెస్పీకి పెరిగిన వరద

### ప్రాజెక్టులోకి 25,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,150 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 28.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 59. 766 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 564 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 22.360 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.302 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మల్యాల, జూలై 26: మండలంలోని రాజారం ప్రభుత్వ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పాఠశాల ఆఫీస్ గది తాళాలు పగులగొట్టి అందులోని కంప్యూటర్‌తో పాటు సంబంధిత పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవలే మన ఊరు-మన పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కూడా ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేసి, గదిలోని వస్తువులను అస్త్యవ్యస్తంగా పడేశారు. సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుందని తెలిపారు. కాగ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిసర ప్రాంతాలను గాలించారు.

### అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై ఏ.నరేష్‌కుమార్ మండల ప్రజలను కోరారు. ఇటీవల పాఠశాలలు, మండలంలో దొంగతనాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లకు తాళం వేసి వెళితే బంగారు ఆభరణలు, నగదు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

## పారిశుధ్య కార్మికురాలిపై దాడి

ఎల్లారెడ్డిపేట, జూలై 26: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య కార్మికురాలు ర్యాకం నర్సవ్వపై యువకుడు బత్తుల రాజు దాడి చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని నర్సవ్వ పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఇంటి పక్కన ఉన్న బత్తుల రాజుతో కొంత కాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న నర్సవ్వపై రాజు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయపడింది. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. తీవ్ర గాయాలైన నర్సవ్వను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బేగంపేట్‌లో వ్యక్తిపై..

**రామగిరి:** మండలంలోని బేగంపేట్ గ్రామంలో గురువారం రాత్రి వాట్సాప్ మేసెజ్‌తో వచ్చిన వివాదం చివరికి ఓ వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి గ్రామానికి సంబంధించిన గ్రూప్‌లో అభ్యంతరకరంగా ఉన్న వ్యాఖ్యలతో కూడిన అంశాన్ని వాట్సాప్‌లో పోస్టు చేశాడు. వాట్సాప్ మెసెజ్ విషయంపై అడిగిన దాసరి శ్రీనివాసును సాయితో పాటు సురేందర్, దశరథం అనే మరో ఇద్దరు వ్యక్తులు నీకు ఎందుకు అంటూ దుర్భాషలాడుతూ బీర్ సీసాను పగలగొట్టి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, జూలై 26: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన మాకోటి లక్ష్మయ్య (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మధుసూధన్ రావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడని ఈ మధ్యకాలంలో కిడ్నీ నొప్పి తీవ్రత ఎక్కువగా కావడంతో శుక్రవారం పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన పక్కన ఉన్న రైతులు కుటుంబ సభ్యుల సహకారంతో వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రామగిరి, జూలై 26: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన కాసాని వినోద్(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వినోద్‌కు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో కాలు విరిగిపోగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. విరిగిన కాలుతో మేస్త్రీ పనులు చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. మానసికంగా కలత చెందిన వినోద్ శుక్రవారం తెల్లవారు జామున తాడుతో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కాసాని అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కేసీఆర్ పాలనలో నిండుకుండలా గోదావరి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గోదావరినదిని పరిశీలిస్తున్న కేటీఆర్

గోదావరిఖని, జూలై 26: కేసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండాలా ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎండిన గోదావరి దర్శనమిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో పర్యటనకు వచ్చిన కేటీఆర్ శుక్రవారం ఉదయం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి వంతెనపై ఆగి గోదావరినదిని పరిశీలించారు. ఎండిన గోదావరినదిని చూసి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కన్నేపల్లి పంప్‌హౌస్ నడిపి నీటిని ఎత్తిపోస్తే గోదావరినది నిండుకుండలా ఉంటుందని కేటీఆర్ అన్నారు. పర్యటనలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

## ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



బ్యాంకు ఎదుట మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

శంకరపట్నం, జూలై 26: తమకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కాలేదని మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఇతర బ్యాంకుల్లో రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ అయ్యిందని, ఇండియన్ బ్యాకుంలో ఎందుకు కాలేదని రైతులు బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. రుణమాఫీ జాబితా పంపించారా అని మేనేజర్‌ను ప్రశ్నించారు. జాబితా పంపిస్తే తమకు చూపించాలని మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మండల వ్యవసాయాధికారిని ఫోన్ ద్వారా సంప్రదించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన చెప్పడంతో ఆందోళన విరమించారు.

## ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26 : వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్య ఎనగంటి రేఖను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

### సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గణాధిత్య(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జూలై 26: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ క్యాంపులోని గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రాజారపు గణాధిత్య(13) ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందాడు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. మెట్‌పల్లి అనుసంధానమైన ఆరపేట గ్రామానికి చెందిన రాజారపు మహేష్, లావణ్యలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు పుట్టిన రెండు నెలలకు, చిన్న కుమారుడు ఆరేళ్ల కింద ఫిట్స్‌తో మృతి చెందారు. రెండో సంతానం అయిన గణాధిత్యను మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవలే చేర్పించారు. శుక్రవారం ఉదయం పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి గణాధిత్యకు ఫిట్స్ వచ్చింది ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సమాచారం అందించారు. విద్యార్థి తండ్రి వెంటనే పాఠశాలకు చేరుకుని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపల్ విద్యసాగర్‌ను వివరణ కోరగా విద్యార్థులు అంతా కలిసి వార్డులో నిద్రిస్తున్నారని, అంతలోనే గణాధిత్యకు ఫిట్స్ వచ్చినట్లు తోటి విద్యార్థులు సిబ్బంది దృష్టికి తేవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించినట్లు వివరణ ఇచ్చారు.

### భయంతో ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మండలంలోని పెద్దాపూర్ క్యాంపు గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయంతో ఇంటి దారి పట్టారు. పాఠశాలలో శుక్రవారం వేకువ జామున విద్యార్థి గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందడంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.

## బావిలో పడి వృద్ధుడి మృతి



బొందయ్య మృతదేహం

చిగురుమామిడి, జూలై 26: మండలంలోని రేకొండకు చెందిన మొగిళి బొందయ్య (70) ప్రమాదవ శాత్తు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. బొందయ్య గొర్రెలను మేపడానికి వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం గొర్రెలను ఇంటికి తోలుకొస్తున్నక్రమంలో ఓ గొర్రె పిల్ల సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడింది. దానిని రక్షించడానికి బొందయ్య తాడు సహాయంతో బావిలోకి దిగాడు. గొర్రె పిల్లను బావిలోంచి బయటకు తీశాడు. బావి నుంచి బయటకు వస్తున్న క్రమంలో తాడు తెగిపోయి బావిలో పడి నీట మునిగి మృతి చెందాడు. బొందయ్య కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

## ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిష్టంపల్లి శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన మార్వాడి రాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఎస్సారెస్పీ నిర్మాణం ప్రారంభించి 61 ఏళ్లు పూర్తి

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ వరద ప్రదాయినిగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంఖుస్థాపన జరిపి నేటికి 61 ఏళ్లు పూర్తవుతోంది. 1963 జూలై 26వ తేదీన అప్పటి ప్రధాన మంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ పోచంపాడ్ వద్ద పునాది రాయి వేసిన రోజును పలువురు రైతులు, అధికారులు నెమరువేసు కుంటున్నారు. నీటి పారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలుగా ప్రధాని నెహ్రూ అభివర్ణించారని గుర్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోచంపాడ్ ప్రాజెక్టు వద్ద పండిత్ నెహ్రూ విగ్రహానికి శుక్రవారం పలువురు ఎస్సారెస్పీ అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా డ్యామ్ వద్ద గల నీటి ప్రవా హంలో గోదావరి తల్లికి పూలు సమర్పించారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈ చక్రపాణి, డీఎస్ఈ లాల్ సింగ్, డీఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి, డ్యామ్ ఏఈఈ వంశీ పాల్గొన్నారు.



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

## ఎన్టీపీసీలో ముగిసిన కేవీ రీజినల్ స్పోర్ట్స్

జ్యోతినగర్, జూలై 26: రామగుండం ఎన్టీపీసీలో రెండు రోజులుగా జరుగుతున్న కేంద్రియ విద్యాలయాల(కేవీ) రీజినల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఎన్టీపీసీ జ్యోతిక, స్పందన ఇండోర్ స్టేడియంల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.శ్రీజ (పికెట్ కేంద్రియ విద్యాలయం) ప్రథమ, దండు తేజశ్విని (నల్గొండ కేవీ) ద్వితీయ, ఏంజెల్ (గచ్చిబౌలి కేవీ) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 19 విభాగంలో కె జాహ్నవి (కాకినాడ కేవీ) మొదటి స్థానం, ఎస్ సహర్ష(పికెట్) రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ జట్టుకు ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే కేంద్రియ విద్యాలయాల సంఘటన్ ఆధ్వర్యం లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొం టారని ఎన్టీపీసీ కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో సహకరించిన ఎన్టీపీసీ యాజమాన్యానికి, ఇతర సిబ్బంది, కోచ్, ఉపాధ్యాయులకు శోభన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.



పతకాలు అందుకున్న అండర్ 19 విజేతలు

## బెంబేలెత్తిస్తున్న చోరీలు

- వరదకాలువకు అమర్చుకున్న ఫ్యూజ్‌లను వదలని దొంగలు
- వరుస చోరీలతో రైతుల ఆందోళన



ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లిన్నట్లు చూపుతున్న రైతులు

మల్యాల, జూలై 26: వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేసుకునే రైతులు దొంగతనాలతో ఆందోళన చెందుతున్నారు. కాలువలోని నీటిని వినియోగించుకునేందుకు గాను ఏర్పాటు చేసుకున్న పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను గత కొన్నేళ్లుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లడంతో బెంబె లేత్తుతున్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా వరుసగా కొనసాగుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ నుంచి బల్వంతాపూర్ శివారు వరకు గల దాదాపు 14కి.మీల వరద కాలువకు వందలాది రైతులు పంప్‌మోటార్లను అమర్చుకొని సాగు చేసుకుంటున్నారు.

అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను ఎత్తుకెళుతున్నారు. కొన్నేళ్లుగా కాపర్ తీగలతో పాటు విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళుతున్నారు. తాజాగా గురువారం అర్థరాత్రి కూడా నూకపల్లి శివారు నుంచి మల్యాల శివారు వరకు గల విద్యుత్ పంప్‌సెట్ల వద్ద స్టార్టర్ బాక్స్‌లకు అమర్చిన 20 మంది రైతు లకు సంబంధించిన ఫ్యూజ్‌లను ఎత్తుకెళ్లారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడం, పంటల సాగు కొనసాగు తున్న తరుణంలో దొంగలు కాపర్, విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గతంలో దొంగలు చిక్కినా..

ఈ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం పంప్‌మోటార్లను పగులగొట్టి కాపర్‌తీగలు, విద్యుత్ తీగల దొంగతనాలకు పాల్పడిన దొంగలు గత రెండేళ్ల క్రితం పట్టుబడగా కేసులు కూడా నమోదు అయ్యాయి. వారి వద్ద తీగలు రికవరీ చేసినా రైతులుకు అందలేదు. అదిఅలా ఉంటే దొంగతనాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా పంటల సాగు సీజన్‌లలో వరుస దొంగతనాలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విద్యుత్ తీగలలో ఉండే కాపర్ తీగల కోసం నిప్పంటించి కాపర్‌నే వేరు చేసి అమ్ముకుంటారు. గత నెల రోజుల నుంచి మూడు సార్లు నూకపల్లి శివారు నుంచి బల్వాంతపూర్ వరకు పదుల సంఖ్యలో రైతుల విద్యుత్ తీగల చోరీకి గురి అయ్యాయి. దీంతో ఇటీవల రైతులు కాపర్ తీగలకు బదులు అల్యూమినియంతో ఉండే తీగలను ఏర్పా టు చేసుకుంటున్నారు. దొంగల బెడదను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవల్సి ఉంది.

### నష్టపోవాల్సి వస్తుంది

**రాయలింగం, రైతు, నూకపల్లి**

వరదకాలువకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్ల కాపర్, విద్యుత్ తీగలను తరచూ ఎత్తుకెళ్లడంతో మళ్లీ కొనుగోలుతో నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగుకు కూడా ఇబ్బందులు అవుతున్నాయి. కొన్ని సార్లు రాత్రి వేళ్లల్లో కాపాలా కూడా ఉండాల్సి వస్తుంది. దొంగతనాల నివారణకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలి. పర్యవేక్షణ కూడా చేయాలి.

## చదువులో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థినికి నగదు అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 26: చదువులో రాణిస్తున్న నిరుపేద విద్యార్థులను చదువుకునేలా ప్రోత్సహించాలని, ఆర్థిక సహాయం అందించేందుకు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కోరారు. వీర్నపల్లి మండలం బావుసింగ్ నాయక్ తండాకు చెందిన బాదావత్ మధులత ఐఐటీలో సీటు సాధించగా సీఎం రేవంత్‌రెడ్డి చదువుకు నిధులను సమకూర్చారు. విషయం తెలుసుకున్న సేవాలాల్ సోషల్ సర్వీస్‌కు చెందిన పలువురు సేకరించిన రూ.లక్ష నగదును అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ చేతుల మీదుగా మధులతకు అందించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు భూక్య గజన్‌లాల్, ప్రధాన సలహాదారులు భూక్య కళావతిహాజునాయక్, వన్‌పల్లి మాజీ ఎంపీటీసీ బానోతు పద్మసేవ్యానాయక్, కోశాధికారి భూక్య లింగంనాయక్, ప్రధానకార్యదర్శి రవిలాల్‌నాయక్, గోర్‌సేన అధ్యక్షుడు భూక్యరాజునాయక్, గోపినాయక్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సన్మానిస్తున్న వైద్యాధికారి గీతాంజలి, సిబ్బంది

ముస్తాబాద్, జూలై 26:సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజగోపాల్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్ గదులను పరిశీలించారు. కొండాపూర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజ గోపాల్‌ను సన్మానించారు. వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి, హెచ్‌ఈవో యాదగిరి, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## పశు వైద్యాధికారికి సన్మానం

చందుర్తి జూలై 26: మండల పశు వైద్యాధికారిగా పని చేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ నితిన్‌కుమార్‌ను మండల నాయకులు, అధికారులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, నాయకులు చిర్రం తిరుపతి, బత్తుల కమలాకర్, మొగిలి రవి, పోతరాజు నగేష్, నాగుల శంకరయ్య బత్తుల సుధాకర్, మర్రి రాజు, జీవన్, అనిల్ పాల్గొన్నారు.

## పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఆషాఢ మాసం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మీ, పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీరాం సుద ర్శన్, గోసికె దేవదాస్, యువజన విభాగం అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పూజలు

సిరిసిల్ల రూరల్, జూలై 26 : సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ, మైసమ్మ పండుగలతోపాటు గొల్లపల్లి దర్గాలో కందూరు వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని పోచమ్మ, మైసమ్మ అలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దర్గాలో కందూర్ పండుగ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సూరంపేట కాశీ, కనకం శ్రీనివాస్, నల్ల రమేష్, నరేష్, అవుల మహేష్, మల్లేశం పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి, జూలై 26 : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ శివారులో శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు అంకుసాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని గౌరవేణి రాజుపై కేసు నమోదు చేశామని, వాహనాన్ని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

## పారిశుధ్య పనులు చేపట్టాలి

ముస్తాబాద్, జూలై 26: పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి ఆధ్వర్యంలో పలువురు తహసీల్దార్‌కు సురేశ్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. గ్రామాల్లో మురికి కాలువల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రోజు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యూత్ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, టీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్, కంచం నర్సింలు, ఎండీ జహంగీర్‌మిరుదొడ్డి యాదగిరి, శీలం వెంకటేశ్, ప్రశాంత్ గుణశేఖర్ శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఉద్యోగుల బదిలీని నిలిపి వేయాలి

వేములవాడ టౌన్, జూలై 26: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలు వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజన్న ఆలయంలో పని చేసే ఉద్యోగులు స్థానికంగా స్థిరపడి ఉన్నారని, పిల్లల స్కూళ్లకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఉన్నఫలంగా బదిలీలు చేయడం సమంజసం కాదని, వారి సంక్షేమం దృష్ట్యా మరోమారు ఆలోచన చేయాలని కోరారు.

## మహిళా హక్కుల సాధనకు ఉద్యమించాలి

భగత్‌నగర్, జూలై 26: మహిళా హక్కులసాధనకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఐద్వా రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళలను విస్మరించారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెఎస్ ఆశాలత, మాచర్ల భారతి, నాగలక్ష్మి, శశికళ, అనుమల మహేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గంభీరావుపేట, జూలై 26 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో ఇటీవల తాటికొండ కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు కిష్టయ్య కుటుంబానికి శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సూచనల మేరకు సాయాన్ని అందజేశామన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి. మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు ఎర్ర కిషన్‌గౌడ్, వేణు, సంతోష్, రామిరెడ్డి, నాంపెల్లి, దేవగౌడ్, రాజయ్య, మారుతి, స్వామి, రవి, సంపత్, సత్తయ్య. రాజు కుమార్, స్వామి ఉన్నారు.

# సమస్యల బడి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కష్టాలు
- కంపుకొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- అసంపూర్తి భవనంలో తరగతి గది
- స్వీపర్లు, స్కావెంజర్లు లేక అవస్థలు
- పాఠశాలలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- సమస్యల మధ్య విద్యార్థుల చదువులు



రంగంపేటలో అసంపూర్తి భవనంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

వీర్నపల్లి, జూలై 26: వీర్నపల్లి మండలం రంగంపేట, బంజేరు, వన్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత కరువైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కష్టాలు పడుతున్నారు. పాఠశాలల్లో స్వీపర్లు, స్కావెంజర్లు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. పాఠశాల ఆవరణ, చుట్టు పక్కల ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండుకుంటున్నాయి. అపరిశుభ్రంగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాఠశాలలు కంపు కొడుతున్నాయి. విద్యార్థులు అదే వాతావరణంలో తరగతులకు హాజరు కావాల్సిన పరిస్థితి. రంగంపేట ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తి గా ఉన్న భవనంలోనే తరగతి గదిని ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. తరగతి గది ఫ్లోరింగ్ సరిగా లేకపోవడంతో బండరాళ్ల మధ్య విద్యార్థులకు టేబుళ్లను వేసి కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాల సమయంలో వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు తప్పవు. పాలకులు, ఉన్నతాధికారులు మారుమూల ఆటవీ పల్లెల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించాలని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### వసతులు కల్పించాలి

**- జాలపల్లి మనోజ్ కుమార్, (ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు)**



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. మూత్ర శాలలు, మరుగుదొడ్లు సరిగా లేని పాఠశాలలను అధికారులు గుర్తించి శుభ్రం చేయించాలి. పాఠశాలలో చెత్తాచెదారాన్ని తొలగించాలి. పూర్తిస్థాయి లో భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. ఉన్నతాధికారులు స్పందించాలి.





కంపుకొడుతున్న మూత్రశాలలు, పాఠశాలలో పేరుకుపోయిన చెత్తాచెదారం

## విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి వివక్ష ఎందుకు?

సిరిసిల్ల రూరల్, జూలై 26: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వా నికి వివక్ష ఎందుకని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మాల్లారపు ప్రశాంత్ ప్రశ్నించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఎస్ ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ బడ్జెట్ పత్రా లను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చేస్తామని చెప్పి అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నిరాశ పర్చిందన్నారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీలా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక, స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఏరపడిన తర్వాత మొదటి సారి 10 శాతం విద్యారంగానికి నిధులు కేటాయించారని, తర్వాత ఏటా తగ్గిస్తూ వస్తున్నారని అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో 7.3 శాతం నిధులు కేటాయిం చారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు చిగుర్ల అనిల్, రవి, తరుణ్, అరుణ్, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసేలా రాష్ట్ర బడ్జెట్

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దశ దిశ లేకుండా ప్రజలను మోసం చేసేలా ఉం దని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరో పించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు విలేక రుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ దేవస్థా నం అభివృద్ధికి ఒక్క రూపాయి వెచ్చించకపోవడం దారు ణమని అన్నారు. నిరుద్యోగ భృతి రు. 4 వేలు, రైతు కూ లీల జాడలేదు, కౌలు రైతుల ఊసే లేదని దళిత బంధు కు రాం రాం చెప్పారని అన్నారు. విద్యార్థులకు రు. 5 లక్షల ఆర్థిక భరోసాను పట్టించుకోలేదన్నారు. గల్ఫ్ సంక్షే మ నిధికి నిధులు కేటాయిస్తామని చెప్పిన హామీని నిల బెట్టుకోలేదని విమర్శించారు.

# మేర కులస్థులను బీసీ ఏలో చేర్చాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న మునిగాల రాము

సిరిసిల్ల రూరల్, జూలై 26: మేర కులస్థులను బీసీ-బీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని తెలంగాణ మేరు రిస్టర్ సంఘాల ఐక్యవేదిక జేఏసీ రాష్ట్ర చైర్మన్ మునిగాల రాము కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం తెలంగాణ మేరు రిజిస్టర్ సంఘాల ఐక్యవేదిక జేఏసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓదెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర‌గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తమ కులాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో కుట్టుమిషన్ పనులు లేక ఆర్థికంగా వెనుకబడిపోయారన్నారు. జిల్లా కేంద్రంలో ఐదు వేల కుట్టుమిషన్‌లతో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ టెండర్‌లు ఇచ్చి మేర కులవృత్తిని ఆదుకోవాలని కోరారు. జేఏసీ వ్యవస్థాపకుడు సంపం వెంకట్రాజం, ముఖ్య సలహాదారులు మునిగాల రమేష్, కీర్తి జయంత్, గట్ల పద్మనాభం, శీలంనగేష్, దీకొండ లక్ష్మణ్, దీకొండ శేషగిరి, రామగిరి శ్రీనివాస్, రామగిరి ఈశ్వర్, రామగిరి మోహన్, రామగిరి గణేష్, తెంబరవేణి వేణు, శ్రీనివాస్, వెన్ను నర్సయ్య మాడిశెట్టి నర్సయ్యలు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌కు తరలిరావాలి



సిరిసిల్లలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

సిరిసిల్ల రూరల్, జూలై 26 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి యజమానులు, ఆసాములు, కార్మికులు తరలిరావాలని నాయకులు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమ, అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేప ట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యుత్ సబ్సిడీ తొలగించడంతో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పరిశ్రమలను బంద్ చేయడంతో ఆసాములు, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, ఉపాధిని కల్పించాలని అన్నారు. ఏడు నెలల నుంచి సీఎంతోపాటు మంత్రుల చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదన్నారు. సిరిసిల్లలో జేఏసీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో శనివారం చలో హైదరాబాద్ చేపట్టినట్లు, ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం మరమగ్గాల పరిశ్రమల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంతకుముందు బీజేపీ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్‌తోపాటు పాలిస్టర్ అసోసియేషన్ నాయకులు శిబిరంలో దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి అంకాలపు రవీందర్, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పంతం రవి, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, గజ్జెల్లి శ్రీనివాస్, గాజుల నరేష్, మచ్చ వేణు, వేముల నర్సయ్య, సామల శ్రీనివాస్, బచ్చు సదానందం,ర అకుబత్తిని లక్ష్మీనారాయణ, పులిశ్రీకాంత్, స్వర్గం చంద్రశేఖర్, గుంటుకు సత్యనారాయణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనను గ్రహిస్తున్న ప్రజలు



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ టౌన్, జూలై 26: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆల యానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించని కాంగ్రెస్ అసమర్థపాలనను ప్రజలు గ్రహిస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీలను రాజీనామా చేయాలని అడిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏంచేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తానని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిధులు తీసుకొస్తామని రాజన్న ఆలయం ఎదుట చెప్పి మర్చిపోయారని గుర్తు చేశారు. ఎన్నికల హామీల్లో ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అక్కనపల్లి వివేక్‌రెడ్డి, సంటి మహేష్, మనోజ్, బిల్ల కృష్ణహరి, నామాల శేఖర్, సగ్గు రాహుల్ తదితరులు ఉన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

కోనరావుపేట, జూలై 26: చేనేత కార్మికులను ఆదుకోవాలని సీపీఎం మండల అధ్యక్షురాలు జవ్వాజి విమల అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత కార్మికులకు నిధులు కేటాయించలేదన్నారు. నిమ్మపెల్లిలో చేనేత కార్మికుల పవర్ లూమ్ మూత పడిందన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలు ఇచ్చిన విధంగా అందజేయాలని, చేనేత కార్మికులకు పని కల్పించాలని కోరారు. చేనేత కార్మికులు నల్ల తిరుపతి, లక్ష్మీరాజం, రాపెల్లి గణేష్, రాములు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కోనరావుపేట, జూలై 26: కోనరావుపేట మండలం కొలనూరులో శుక్రవారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన కొత్తకొండ నర్సవ్వకు రూ. 15వేలు, ఫిరోజ్ ఖాన్ కు రూ.25 వేల చొప్పున చెక్కులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బలగం కమలాకర్, పీరబోయిన తిరుపతి, మంత్రి మహేష్, తాళ్లపల్లి విజయ్ గౌడ్, అశోక్, ఎల్లయ్య, రాజయ్య, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఇంటి వద్ద రిజిస్ట్రేషన్ సేవలు

రుద్రంగి, జూలై 26: రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వృద్ధుడి ఇంటి వద్ద తహసీల్దార్ శ్రీలత సిబ్బందితో వెళ్లి శుక్రవారం భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించారు. రుద్రంగికి చెందిన మోతె వెంకటి అనే వృద్ధుడు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నాడు. ఆనారోగ్యం కారణంగా వెంకటి తహసీల్దార్ కార్యలయానికి వెళ్లలేని స్థితిలో ఉన్నాడు. దీంతో ఇంటి వద్దకే వెళ్లి వేలి ముద్రలు తీసుకొని వెంకటి కొడుకు లింబాద్రికి భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు తహశీల్దార్ శ్రీలత తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

రుద్రంగి, జూలై 26: మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి వేములవాడ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్‌మేజిస్ట్రేట్ కావేటి సుజన జరిమానా విధిం చినట్లు రుద్రంగి ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. మద్యంతాగి పట్టుబడిన వారిలో ఐదుగురికి రూ.1000, ఇద్దరికి రూ.2000 చొప్పున విధించినట్లు పేర్కొన్నారు.

## ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26:వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావు పల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్య ఎనగంటి రేఖను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిష్టంపల్లి శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన మార్వాడి రాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



సిరిసిల్ల కార్గిల్ లేక్ వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



మల్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల త్యాగాలు మరువలేనివని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ వద్ద శుక్రవారం కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం కార్గిల్ లేక్, వైజయంతి యుద్ధట్యాంక్ వద్ద ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. యుద్ధ ట్యాంక్ వద్ద కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళి తెలిపారు. మాజీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆడెపు రవీందర్ మాట్లాడుతూ కార్గిల్ విజయానికి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయదివస్‌ను జరుపుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్‌యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు ఊరగొండ రాజు, సదానందం, మ్యాన రాంప్రసాద్, ఆడెపు రేవంత్, గాజుల వేణు, గుడ్ల విష్ణు, సంగీతం సత్యసాయిరాం, మేర్గు శ్రీనివాస్, కోడం రవి, అలువాల నరహరి, గుండెల్లి వేణుగోపాల్, బండారి వెంకటేశ్వర్లు, కోడం ఆనంద్‌బాబు, గుడ్ల సురేష్, అంకారపు రాజు, కౌరంపల్లి రమేష్, మంచికట్ల భాస్కర్, జంప రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ వైజయంతి యుద్ధట్యాంక్ వద్ద కార్గిల్ అమరవీరులకు సిరిసిల్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మాజీ సైనికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుగ్గిళ్ల జగన్‌గౌడ్, మడుపు నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**వేములవాడ టౌన్:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల గురించి తెలిసేలా కార్యక్రమం నిర్వహించామన్నారు.

**చందుర్తి:** మండలంలోని మల్యాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమర జవాన్ల చిత్ర పటం వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు నివాళ్లు అర్పించారు. నాయకులు పాటి సుధాకర్, లోకోజు సతీష్, గొల్లపల్లి సాయికృష్ణ, జాల గంగాధర్, కోట్టె రాజు, ఎలమల లక్ష్మన్, కోట్టె రాహుల్, లక్క వెంకటేశ్, లక్క సాయి, కోట్టె వంశీ పాల్గొన్నారు.